క్లుప్తంగా

మొక్కలు నాటివేత



మొక్కలు నాటుతున్న గ్రీన్ ఆర్మీ సభ్యులు

మందస: బీఎస్‌పురం పంచాయతీ రాధాకృష్ణపురంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పలాసకు చెందిన గ్రీన్‌ఆర్మీ సభ్యులు ఆదివారం చేపట్టారు. ఈసందర్భంగా గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు గుసిరి తాతయ్య మాట్లాడుతూ.. పర్యావరణం పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టాలంటే మొక్కలు నాటి పెంచడమే పరిష్కారమన్నారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ సభ్యులు నగిరి కరుణాకర్, బి.తిరుమల, కొంచాటి అభిలాష్, గ్రామపెద్దలు లోళ్ల దూర్వాసులు, పి.భాస్కరరావు, పి.రాంబాబు ఎల్.జయరాం పాల్గొన్నారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగవు



మాట్లాడుతున్న ఎంపీపీ దానయ్య

మందస: స్వచ్ఛందంగా సేవలు చేస్తున్న వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఎంపీపీ డొక్కరి దానయ్య, మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకటరావు అన్నారు. రాజకీయాల్లో అనుభవంలేకనే ఆయన నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారన్నారు. సొండిపూడిలో విలేకరులతో ఆదివారం మాట్లాడుతూ.. సినిమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ..రాజకీయాల్లో అప్పుడప్పుడు మాట్లాడుతున్న పవన్‌కు రాజకీయ పరిజ్ఞానం లేదన్నారు. స్వచ్ఛందంగా పని చేస్తున్న వలంటీర్లపై ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం సరికాదన్నారు. ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న వలంటీర్ వ్యవస్థను కించపరచడం అన్యాయమన్నారు. వారు సంఘ సేవకుల్లాంటివారన్నారు. వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని.. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ గౌరహరి మహంతి, బతకల దాలయ్య ఉన్నారు.

బోరు పనులు ప్రారంభం



పూజ చేస్తున్న సర్పంచ్ సంజీవరావు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలోని సంత మైదానం సమీపంలో మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న బోరు పనులు ఆదివారం ప్రారంభమ్యాయి. సర్పంచ్ కాల్ల సంజీవరావు పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. బోరు ఏర్పాటుతో కరణాలవీధి, సెగిడి వీధుల ప్రజలకు నీటి సమస్య తీరనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్తమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్ బోయిన కృష్ణారావు, పంచాయతీ ఈవో కె.కృష్ణారావు పాల్గొన్నారు.

చెత్త సేకరణ డొక్కులు పంపిణీ



డొక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: హరిశ్చంద్రపురం గ్రామంలో తడి, పొడి చెత్త సేకరణ కోసం ప్లాస్టిక్ డొక్కులను సర్పంచ్ గురువెల్లి కేశవరావు, ఎంపీటీసీ సభ్యులు బగాది దివాకర్,పూజారి సత్యం ఆదివారం పంపిణీ చేశారు. ఒక్కో ఇంటికీ రెండు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పారిశుద్ధ్యానికి సహకరించాలని కోరారు. తడి, పొడి చెత్తను వేర్వేరు డొక్కుల్లో వేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి బి.నరేష్, వీఆర్వో బి.విశ్వనాథం పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం



సాయాన్ని అందజేస్తున్న గల్ఫ్ ఫౌండేషన్ సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: కేధారిపురం గ్రామానికి చెందిన అనపాన చంద్రయ్య భార్య శ్యామల కొంత కాలంగా క్యాన్సర్‌తో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న కేధారిపురం గ్రామానికి చెందిన కేపీఎం గల్ఫ్ ఫౌండేషన్ గ్రూప్ సభ్యులు తమవంతు సాయానికి ముందుకొచ్చారు. తమవంతు రూ. 23 వేలు, గ్రామ ప్రజలు రూ.25 వేలు సేకరించి..మొత్తం 48 వేల రూపాయలను బాధితురాలి భర్త చంద్రయ్యకు ఆదివారం అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.

● శ్రమదానం



ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు గ్రామస్తులు చేయిచేయి కలిపారు. శ్రమదానంతో మహేశ్వర ఆలయానికి వెళ్లే రోడ్డుకిరువైపులా పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను ఆదివారం తొలగించి ఆదర్శంగా నిలిచారు. గ్రామ నాయకుడు దున్న ఆనంద్ ఆధ్వర్యంలో చిన్నారులు, పెద్దలు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలోని వీధులను కూడా శ్రమదానంతో శుభ్రం పరిచారు.

-ఇచ్ఛాపురం రూరల్

● శంకుస్థాపన



గరుడబద్ర పంచాయతీలోని హరిజనపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ గూడ గిరిజ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. పల్లెల ప్రగతికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉప సర్పంచ్ ఎం.పార్వతి, పార్టీ నాయకులు ఆర్.భాస్కరరావు, ఎస్.జగ్గారావు, ఎం.చంద్రభూషణ్, ఆర్.రామారావు, ఎస్.తారక్, ఎం.కూర్మారావు పాల్గొన్నారు.

-వజ్రపుకొత్తూరు రూరల్

● వంతెన పనులు పరిశీలన



బాహుదా నదిపై ఉన్న వంతెన మే నెలలో కూలిపోయింది. దీనిస్థానంలో తాత్కాలికంగా చేపడుతున్న వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదివారం పరిశీలించారు. పనులను వేగంగా పూర్తిచేసి వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్, ఆర్‌అండ్‌బీ ఏఈ మోహన్‌లకు సూచించారు. పరిశీలనలో వైఎస్సార్‌సీపీ నాయకులు పిలక సంతోష్, బచ్చు జగన్నాథం, పరపటి కోటిరెడ్డి ఉన్నారు.

-ఇచ్ఛాపురం

టీడీపీ బస్ యాత్ర తుస్!

● జనం లేక వెలవెల



జీడి రైతుల్లేక టీడీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు



పలాసలో జనంలేకుండా సాగుతున్న బస్సు యాత్ర

వజ్రపుకొత్తూరు రూరల్: టీడీపీ నాయకులు చేపడుతున్న బస్ యాత్ర రెండో రోజైన ఆదివారం 'తుస్'మంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యుడు కె.రామ్మోహన్‌నాయుడు సహా పలువురు నాయకులు హాజరైనప్పటికీ ప్రజల నుంచి ఏమాత్రం స్పందన కనిపించలేదు. దీంతో ఆ పార్టీ శ్రేణులు నిరుత్సాహానికి గురైయ్యారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల నాయకులు వచ్చినప్పటికీ జనం లేక యాత్ర వెలవెలబోయింది. వజ్రపుకొత్తూరు మండలంలో ఆదివారం బెండి గేట్ హుద్‌హుద్ ఇళ్ల నుంచి ప్రారంభమైన యాత్ర మొక్కుబడిగా వజ్రపుకొత్తూరు మీదగాసాగింది. షెడ్యూల్‌లో భాగంగా అక్కుపల్లి జంక్షన్ వద్ద జీడి రైతులతో ముఖాముఖి నిర్వహించాల్సి ఉండగా.. రైతులు ఎవరూ రాకపోవడంతో టీడీపీ కార్యకర్తలతో నాయకులు మాట్లాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జీడి రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకోవల్సిన నాయకులు వారు లేకపోవడంతో కేవలం ప్రసంగాలతో మమ అనిపించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తిత్లీ తుఫాన్ ఉద్దానాన్ని అతలాకుతలం చేస్తే కేవలం జన్మభూమి కమిటీలు సూచించిన వారికే పరిహారం అందించారే తప్పా నిజమైన బాధితులకు పరిహారం అందించలేదనే విషయం ఉద్దాన రైతులు ఇప్పటికీ మర్చిపోలేదు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వస్తే అది చేస్తాం..ఇది చేస్తాం అని కల్లబొల్లి కబుర్లు చెప్తే ఉద్దాన తీర ప్రాంతాలలో ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని స్థానికుల నుంచి గుసగుసలు వినిపించాయి. కాగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు స్వయంగా బస్ యాత్రలో పాల్గొన్నప్పటికీ ప్రజల కంటే మీడియా ప్రతినిధులే ఎక్కువగా కనిపించడం కొసమెరుపు..

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన టీడీపీ బస్సుయాత్ర అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. పలాసలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ యాత్రను ప్రారంభించగా.. కాశీబుగ్గ మీదుగా మూడు రోడ్ల కూడలికి చేరుకుంది. ఎంపీ కింజరాపు రామ్మోహననాయుడు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, జిల్లా నాయకులు కూన రవికుమార్, బగ్గు లక్ష్మణరావు, గౌతు శిరీషా పాల్గొన్నారు. నాయకులు వాహనంపైనుంచి అభివాదం చేస్తున్నా ప్రజలు ఎవ్వరూ స్పందికపోవడంతో నిరాశచెందారు. కేవలం ఆ పార్టీ కార్యకర్తలతో మాత్రమే కార్యక్రమాన్ని మమఅనిపించారు.

ఆక్రమణలు తొలగించాలని మంత్రికి వినతి



మంత్రి అప్పలరాజుకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు, ఆయకట్టు రైతులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలకు తాగు, సాగునీరు అందిస్తున్న జగన్నాథసాగరంలో ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరారు. జగన్నాథసాగరం గర్భాన్ని కొంతమంది ఆక్రమించేసి భవనాలను నిర్మించుకున్నారన్నారు. ఈ మేరకు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును పలాసలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందించి శాశ్వత పరిష్కారం చేపట్టాలని కోరారు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే నాయకులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. సాగరంలో సుమారు 20 ఎకరాలు ఆక్రమణకు గురైనట్టు రైతులు పేర్కొన్నారు. దీంతో దాని పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు, పట్టణ ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా ఆక్రమణలు తొలగించాలని కోరారు. మంత్రిని కలిసిన వారి మున్సిపాలిటీలో విప్ శంకర్‌పండా, కౌన్సిలర్లు పోతనపల్లి ఉమాహరిప్రసాద్, శర్వాణ రవికుమార్, సీహెచ్‌సీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, సవర సోమేశ్వరరావు, జగన్నాథ సాగర ఆయకట్టు రైతులు నాగరాజు పండా, వాసు, గిరి, ఈశ్వరరావు పాల్గొన్నారు.

అంతర్‌రాష్ట్ర క్రికెట్‌టోర్నీ విజేత పూరీ



బహుమతులు అందజేస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు

ఇచ్ఛాపురం: స్థానిక సురంగి రాజా క్రీడా మైదానంలో ఐసీసీ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15 రోజులుగా జరుగుతున్న భానుమతి నరసింగరావు మెమోరియల్ అంతర్‌రాష్ట్ర సీజన్ -1 టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. విజేతగా పూరీ జట్టు నిలిచింది. ఒడిశాకు చెందిన బరంపురం లీడ్స్, పూరీ జట్లు ఫైనల్‌లో ఆదివారం తలపడ్డాయి. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పూరీ జట్టు నిర్ణీత 14.4 ఓవర్లలో 119 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బరంపురం లీడ్స్ జట్టు 15 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలింది. దీంతో పది పరుగుల తేడాతో పూరీ జట్టు విజేతగా నిలిచింది. విన్నర్‌గా నిలిచిన పూరీ జట్టుకు రూ. 22,222, రన్నరప్‌గా నిలిచిన బరంపురం లీడ్స్ జట్టుకు రూ. 16,666ప్రైజ్‌మనీ, షీల్డ్‌లతో సత్కరించారు. మ్యాన్‌ఆఫ్ ద సిరీస్‌గా సునీల్ పాణిగ్రాహి (బరంపురం లీడ్స్), బెస్ట్‌బౌలర్‌గా సంతోష్ మిశ్రా (బరంపురం లీడ్స్), బెస్ట్ బ్యాట్సుమెన్‌గా సునీల్ పాణిగ్రాహి (బరంపురంలీడ్స్), బెస్ట్ ఫీల్డర్‌గా చిన్ను (కవిటి) ఎంపికయ్యారు. ముగింపు కార్యక్రమంలో భానుమతి నరసింగరావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ -1 అధ్యక్షుడు సామినేని గోపాల్, స్పాన్సర్స్ నర్తు శేషగిరిరావు, వెచ్చా కేశవరావు, ఉప్పాడ ఆనంద్, స్థానిక వైద్యులు డాక్టర్ ఉలాల శేషుయాదవ్, ఐసీసీ జట్టు అధ్యక్షుడు దాసరి రాజు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో ఓ యువతి అదృశ్యమైనట్లు శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని మేదరవీధికి చెందిన విద్యార్థిని కత్తెర వీధిలో రూమ్ అద్దెకు తీసుకుని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ సెకెండియర్ చదువుతోంది. ఈ నెల 14న తల్లి ఆరోగ్యం బాగోలేనందున మేదరవీధి వచ్చింది. అదేరోజు రాత్రి తన స్నేహితురాలింటికి వెళ్లివస్తానని చెప్పిన యువతి మరుసటి రోజైనా తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం ప్రయత్నించారు. అదే రోజు తన సోదరుడికి.. అన్నయ్యా నేను వెళ్లిపోతున్నాను. నన్ను వెతకవద్దు.. మీరు జాగ్రత్తగా ఉండండి అంటూ.. సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపింది. దీంతో ఆందోళనకు గురైన తల్లి ఆదివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో ఓ విద్యార్థిని అదృశ్యమైనట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. పొందూరు మండలం తోలాపి గ్రామానికి యువతి స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతుంది. ప్రతిరోజూ తన మామయ్య ద్విచక్రవాహనంపై కళాశాలకు వెళ్లి తిరిగి ఆటోలో ఇంటికి చేరుకునేది. ఈ క్రమంలో ఈ నెల 14న కళాశాలకు పరీక్ష రాయడానికి మామయ్యతో కలిసి వెళ్లిన యువతి.. ఇంటికి చేరకపోవడంతో స్నేహితులు, బంధువుల వద్ద ఆచూకీ కోసం ప్రయత్నించారు. జాడ తెలియకపోవడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ధనరాజులమ్మకు పూజలు



అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న లొద్దపుట్టి ధనరాజులమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రా, ఒడిశా గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కాళీమాత వేషధారణ, కోలాటం, కోయి నృత్యాలతో అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు.

సోంపేట, కవిటిలో వర్షం

సోంపేట/కవిటి: సోంపేట, కవిటి మండలాల్లో ఆదివారం మోస్తరు వర్షం పడింది. వరి విత్తనాలు వేసి 15 రోజులు దాటినా వర్షం లేకపోవడంతో మొలకెత్తక రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి సదుపాయం ఉన్న రైతులు మోసుకొని నీటిని తెచ్చి నారుమడులు తడిపి కాపాడకునే ప్రయత్నం చేస్తున్నారు. చినుకు జాడ కోసం రోజూ ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. ఈ పరిస్థితిలో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. నారుమడులకు జీవం పోషించదని సంతోషించారు. వ్యవసాయ పనులను ముమ్మరం చేసుకోవచ్చునంటున్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా మోదుగులపుట్టి గ్రామంలో విత్తనశుద్ధిపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఏపీసీఎన్‌ఎఫ్ ఎస్‌డీఏ సీహెచ్ నాగరాజు ఆధ్వర్యంలో బీజామృతంతో సామూహికంగా రైతులందరిచే విత్తనశుద్ధి చేసే విధానాన్ని వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను సాగు చేయాలనుకునే రైతులు ముందుగానే విత్తనాలను శుద్ధి చేసుకుంటే మొలక శాతం బాగా వస్తుందన్నారు. అలాగే విత్తనం నుంచి లేదా భూమి నుంచి సంక్రమించే వ్యాధులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉంగ సనత్‌కుమార్, ఉంగ నారాయణరావు, కె.పాపారావు, ఎ.షణ్ముఖరావు, ఇచ్ఛాపురం కూర్మారావు పాల్గొన్నారు.

ఉమారుద్రునికి ప్రత్యేక అలంకరణ



ఉమారుద్ర కోటేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయంలో మాస శివరాత్రి పురస్కరించుకొని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం

జి.సిగడాం: గ్రామాల్లో రైతుల భూ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ సేతుభీమవరంలో సుమారు ఆరు వందల ఎకరాలు ఇనాం భూములు రైతుల సాగులో ఉన్నాయని, వాటిపై దృష్టి సారించామన్నారు.

అధిక మెజారిటీ సాధిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త దువ్వాడ వాణి, చిత్రంలో పేరాడ తిలక్ తదితరులు

● టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి

నందిగాం: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలుపించుకోవడం కోసం అందరం కలిసి పనిచేసి నందిగాం మండలంలో అత్యధిక మెజారిటీ సాధిద్దామని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. నందిగాంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్‌తో కలిసి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభ్యర్థి ఎవరు అని చూడకుండా జగన్ మోహన్‌రెడ్డిని, వైఎస్సార్ సీపీ జెండాను గుర్తు పెట్టుకొని పనిచేసి విజయాన్ని సాధిద్దామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. మండలంలో ఉన్న నాయకులు, కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా సమన్వయకర్తగా పార్టీని ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. తనను సోదరిగా భావించి అందరూ సహకరించాలని కోరారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయడం కోసం అందరం కలిసికట్టుగా పని చేద్దామన్నారు. త్వరలో మండలంలో నిర్వహించనున్న 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని విజయవంతంగ చేసేందుకు వీలుగా మండలంలోని ప్రతి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, నాయకులకు ముందస్తుగానే సమాచారాన్ని చేరవేద్దామన్నారు. రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా పార్టీ కార్యక్రమాలు చేపడదామన్నారు. సమావేశంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మాజీ ఎంపీపీ యర్ర విశ్వశాంతిచక్రవర్తి, జేసీఎస్ కన్వీనర్ జడ్యాడ జయరాం, నాయకులు తమిరె ఫాల్గుణరావు, కింతల ధర్మారావు, మాదిన గోపాలకృష్ణ, బాలక మధు, చిన్ని జోగారావు పాల్గొన్నారు.

పలాసకు చేరిన జీపుజాతా



మాకన్నపల్లిలో మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

పలాస: జీడి పిక్కలకు మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ చేపట్టిన జీపుజాతా ఆదివారం ఉదయం పలాసకు చేరింది. మామిడిపల్లి, బొడ్డపాడు, మాకన్నపల్లి, నీలావతి, గురుదాసుపురం, గొల్లమాకన్నపల్లి, లొత్తూరు తదితర గ్రామాల్లో మద్దతు ధర కోసం జీడి రైతాంగాన్ని ఆటా పాటలతో చైతన్యం చేశారు. ఈ నెల 18న కాశీబుగ్గ సంతమైదానంలో జరుగనున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 80 కిలోల జీడి పిక్కల బస్తాను రూ.16 వేలకు రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని జీడి రైతుల సంఘం కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. జిల్లా రైతు సంఘం నాయకుడు కె.మోహనరావు మాట్లాడుతూ.. మూడు నెలలుగా అనేక ఉద్యమాలు చేసినప్పటికీ అధికారులు స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు తప్పని పరిస్థితిలో అతి తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు కె.హేమసూదన్, గణపతి, కుత్తుం వినోద్, బత్తిన వీరాస్వామి, తెప్పల సింహాద్రి, సవర సురంగి, వివిధ గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పదోవార్డులోని అంబుసోలి గ్రామంలో నిర్మితమవుతున్న ముత్యాలపోలమ్మ ఆలయపునః నిర్మాణానికి దాతలు సాయం చేస్తున్నారు. అందులో భాగంగా ఎస్‌పీవీ గ్రూప్ చైర్మన్ తమలంపూడి శ్రీనివాసరావు రూ. 20 వేల విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీకి స్థానిక కౌన్సిలర్ శర్వాణ రవికుమార్ సమక్షంలో ఆదివారం అందజేశారు. అనంతరం ఆలయాన్ని గ్రామపెద్దలతో కలిసి సందర్శించారు.

నమో సూర్యదేవా..!



సూర్యనమస్కారాల పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి ఆదిఆరం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉచిత దర్శనాలతో పాటు విశిష్ట, ప్రత్యేక దర్శనాల మార్గాల్లో స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు ప్రత్యేక సూర్యనమస్కారాల పూజలను చేయించుకున్నారు. ఎక్కడా ఇబ్బంది రాకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి క్యూలైన్ వద్ద మంచినీటి ప్యాకెట్లు, ఉచిత ప్రసాదాలు అందజేయించారు. పలువురు దివ్యాంగులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. కేశఖండన శాలలో వందలాది మంది భక్తులు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకోగా.. కలశాల పూజలతో సంప్రదాయంగా స్వామికి ప్రసాదాల నివేదన చేశారు. అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ఎస్.కోటేశ్వర చౌదరి తదితరులు భక్తులకు ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం స్వామిని దర్శించుకున్నారు.

ఇక ప్రతి ఆదివారం లోకల్ దర్శనాలు..

ప్రతి ఆదివారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు రెండు గంటల పాటు స్థానికులకు ఆధార్‌కార్డు చూపించితే..విశిష్ట దర్శనం (రూ.500) ఉచితంగా కల్పించాలని ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ నిర్ణయించారు. ప్రధానార్చకులు శంకరశర్మ, ట్రస్ట్ బోర్డు సభ్యులతో చర్చించిన అనంతరం ప్రయోగాత్మకంగా ఆదివారం ఉదయమే ఈ విధానాన్ని అమలు చేశారు.